క్లుప్తంగా

దీపావళి శుభాకాంక్షలు


టీఎస్ దీపిక

చిలమత్తూరు: హిందూపురం నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీపావళి ప్రతి ఇంట వెలుగులు నింపాలని ఆమె ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గుంతలోకి దూసుకుపోయిన కారు

పెనుకొండ: పట్టణ సమీపంలోని పులేకమ్మ గుడి వద్ద కారు అదుపు తప్పిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. ఆదివారం ఉదయం బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారు పులేకమ్మ ఆలయం సమీపంలో 44వ జాతీయ రహదారిపై వేగంగా వచ్చి అదుపుతప్పడంతో రోడ్డు పక్కన వున్న గుంతలోకి దూసుకుపోయింది. కారు బాగా దెబ్బతినగా అందులోని ఇద్దరికి గాయాలైనట్లు సమాచారం. ఈ విషయమై పెనుకొండ పోలీసులను సంప్రదించగా ప్రమాద విషయం తమకు తెలియదన్నారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి


దుకాణాలను పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెనుకొండ: టపాసుల విక్రయదారులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక సిబ్బంది సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వ్యాపారులు టపాసుల దుకాణాలను ఆదివారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా వ్యాపారులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అగ్నిమాపక సిబ్బంది సూచనలు చేశారు. ఇదిలా ఉండగా వ్యాపారులు టపాసులను అధిక ధరలకు విక్రయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వృద్ధురాలికి వాత్సల్య గృహం


వృద్ధురాలిని సత్కరిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని లింగదహళ్లి వలయంలోని న్యాయదకుంటె గ్రామ పంచాయతీకి చెందిన దేవరాయనరొప్పలో శ్రీ క్షేత్ర ధర్మ స్థల గ్రామాభివృద్ధి బీసీ ట్రస్ట్ యోజన వాత్సల్య కార్యక్రమంలో భాగంగా కంటి చూపు పూర్తిగా కోల్పోయిన వృద్ధురాలు శివమ్మకు వాత్సల్య గృహాన్ని నిర్మించి అందించారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెంగళూరు విభాగం ప్రాదేశిక డైరెక్టర్ సీనప్ప చేతుల మీదుగా గృహాన్ని వృద్ధురాలికి అప్పగించారు. కార్యక్రమంలో స్థానిక మాజీ జిల్లా పంచాయతీ సభ్యుడు తిమ్మారెడ్డి, గ్రామ ప్రముఖుడు ఎస్‌పి ఈరణ్ణ, తాలూకా యోజనాధికారి మహేశ్, జన జాగృతి వేదిక సభ్యురాలు రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం


నగదు అందిస్తున్న జీరిగేపల్లి గ్రామస్తులు

రొళ్ల: జీరిగేపల్లి గ్రామ సమీపాన వెలసిన అమ్మాజీ ఆలయం అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన దాదాపు వంద కుటుంబాలు ఒక్కటై రూ.12 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులకు ఆదివారం అందజేశారు. రూ.2.80 కోట్ల వ్యయంతో పురాతన ఆలయాన్ని పునర్నిర్మించనున్నారు. ఈనేపథ్యంలో గ్రామస్తులు తమవంతుగా విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు గ్రామపెద్దలను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆలయ నిర్మాణానికి దాతలు విరివిగా విరాళాలు అందించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

బాధిత రైతుకు ఆర్థిక సాయం

రొళ్ల: హనుమంతనపల్లిలో రైతు రంగనాథ్ చెందిన 50 వక్కచెట్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేసిన విషయం తెలిసిందే. ఆదివారం రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ బాధిత రైతుకు ఆర్థిక సాయం అందజేశారు. ఇదిలా ఉండగా బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనుమానితుడి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఉచితం మాటున తవ్వేస్తున్నారు..!

- పెన్నానదిలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- నది నిండా దర్శనమిస్తున్న గోతులు
- పట్టించుకోని అధికారులు


ఇసుక తవ్వకాలతో పెన్నానదిలో ఏర్పడిన గుంతలు


పెద్దమంతూరు పెన్నానది నుంచి ట్రాక్టర్‌లో తరలుతున్న ఇసుక

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి ఉచితం మాటున ఇసుక అక్రమ తవ్వకాలకు అంతూపొంతూ లేకుండా పోయింది. డబ్బు సంపాదనే ధ్యేయంగా కొంతమంది ట్రాక్టర్ యజమానులు ప్రకృతి వనరులను దోచేస్తున్నారు. మండలంలో పెన్నానది నుంచి రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్చా ఇసుక తరలిపోతోంది. నదిలో ఎక్కడపడితే అక్కడ యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో పెద్దపెద్ద గంతలు ఏర్పడ్డాయి. అయినా సంబంధిత అధికారులు తమకేమీ తెలియనట్టు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కర్ణాటకకు తరలింపు..

పెన్నానది నుంచి రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా అధికంగా జరుగుతోందని నదీతీర గ్రామాల ప్రజలు చెబుతున్నారు. రోజూ దాదాపు 150 ట్రాక్టర్ల నుంచి 200 ట్రాక్టర్ల వరకూ ఇసుక రవాణా చేస్తున్నాయి. ప్రధానంగా పెద్దమంతూరు, చెరుకూరు పెన్నానది ప్రరివాహక ప్రాంతం నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టి మడకశిర సమీపాన మురరాయినపల్లి వద్ద డంప్ చేసి అక్కడి నుంచి బెంగళూరు, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఇదంతా తెలిసినా కూడా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేట దూరంలో పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా పెద్ద ఎత్తున సాగుతున్న ఎవరు స్పందించడం లేదని చెబుతున్నారు.

ఆందోళనలో రైతులు..

ఇసుక తవ్వకాలు అధికంగా ఉండడంతో పెన్నానదిలో ఫిల్టర్ బోర్లు వేసుకుని వ్యవసాయంపై ఆధారపడిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక తరలిపోతే వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడుగింటి పోర్లు ఎండిపోయే పర్థితి వస్తోందంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బోర్ల వద్ద ఇసుక తరలించకూడదని అడ్డగిస్తే తమపై ఇసుకాసురులు దౌర్జన్యం చేస్తున్నారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇసుక అక్రమ రవాణా భారీగా సాగుతోందని, కూటమి నేతలు విచ్చలవిడిగా రావాణా చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇసుక రవాణా ఇలాగే సాగితే వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడగంటి మండల వ్యాప్తంగా తాగునీటి సమస్య ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ట్రాక్టర్ ఇసుక ధర రూ. 2,500 నుంచి రూ 5 వేలు, అదే బెంగళూరు అయితే లారీ ఇసుక రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకూ ధర ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



మండల వ్యాప్తంగా పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా భారీగా సాగుతోంది. ఉచితం మాటున అక్రమార్కులు కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పెన్నానది మొత్తం గోతుల మయంగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి.

– ఫక్రోద్దీన్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రొద్దం

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటాం



పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా అడ్డుకుంటాం. దీనిపై పోలీసులతో చర్చించి చర్యలు తీసుకుంటాం. నదిలో ప్రాంతంలో అవసరాలకు ఉచితంగా ఇసుక తవ్వుకునేందుకు అనుమతించాం. ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా పెట్టాలని సిబ్బందికి సూచనలు చేస్తాం.

– ఉదయ్‌శంకర్‌రాజు, రొద్దం తహసీల్దార్

వాల్మీకి విగ్రహానికి జ్యోతులు


చోళసముద్రంలో జ్యోతులు మోస్తున్న మహిళలు


కరియమ్మనపాళ్యలో జ్యోతులు మోస్తున్న మహిళలు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలను పురష్కరించుకుని ఆదివారం ఉదయం వాల్మీకి విగ్రహానికి మహిళలు జ్యోతులు మోశారు. గ్రామంలో ప్రతి వాల్మీకి కుటుంబం నుంచి మహిళలు జ్యోతులను మోసుకుని గ్రామ దేవత చౌడేశ్వరి దేవాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి మహిళలు జ్యోతులు మోసుకుని ఊరేగింపుగా వాల్మీకి విగ్రహం వద్దకు చేరుకుని సమర్పించారు. అనంతరం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వాల్మీకి పెద్దలు యస్.మూర్తి, టి.మూర్తి, సురేష్, అనిల్, గంగాధరప్ప, నరేష్‌తో పాటు గ్రామపెద్దలు నారాయణస్వామి, ప్రభాకర్‌రెడ్డి, గోపి, సీపీఐ నాయకులు శివప్ప, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విశ్వ విద్యాలయాన్ని స్థాపించాలి

పావగడ: రాష్ట్రం లో మహర్షి వాల్మీకి బుడకట్టు విశ్వ విద్యాలయాన్ని స్థాపించాలని స్థానిక వాల్మీకి సంఘం నాయకుడు లోకేశ్ పాళేగార్ ప్రభుత్వన్ని కోరారు. దీంతో వాల్మీకి సామాజిక వర్గం సమగ్ర ఇతిహాసాన్ని వెలుగు లోకి వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. తాలూకాలోని కరియమ్మనపాళ్య గ్రామంలో ఆదివారం నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. వేడుకల్లో వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగించారు. మహిళలు జ్యోతులు మోశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను గాలికొదిలేసిన బాబు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: ఎన్నికల హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబును గాలికొదిలేశారని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఆదివారం గుణేహళ్లిలో వైఎస్సార్‌సీపీ నేత నంజుండప్ప గృహంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను నేరవేర్చలేక ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అమ్మ ఒడి, ఆడబిడ్డ నిధి, రైతులకు రైతుభరోసా డబ్బు సక్రమంగా జమ చేయలేదన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎంపీపీ ఈరన్న, వైస్.ఎంపీపీ క్రిష్ణమూర్తి, ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చిత్తయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నంజుండప్ప, అమరీష్ బాబు, చిత్తప్పయాదవ్, మురళీ, బిడి.నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం


అమరాపురంలో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

అమరాపురం: కోటి సంతకాల సేకరణతో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందామని కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీరక్యాతరాయ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, నియోజకవర్గ ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు శివన్న, శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దంటూ కోటి సంతకాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేద విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి చర్యలు చేపట్టి ఐదింటిని పూర్తి చేశారన్నారు. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను పూర్తి చేయకుండా ప్రైవేటుకు కట్టబెడుతోందన్నారు. తద్వారా సామాన్యులకు ఉచిత వైద్యంతోపాటు పేద విద్యార్థులు వైద్య విద్యను దూరం చేస్తోందన్నారు. కోటి సంతకాల ద్వారా ప్రభుత్వ నిర్ణయాన్ని తిప్పికొడదామని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం ప్రజలతో సంతకాలు సేకరించారు. ఎంపీటీసీలు నారాయణ, హనుమంతరాయ, సర్పంచులు సదానందగౌడ, మంజుల, ఐటీ విభాగం అధ్యక్షుడు చిత్తప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

రొళ్ల: రత్నగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం 1995–96 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు సమావేశమయ్యారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత కలవడంతో వారి ఆనందాలకు అవధుల్లేకుండా పోయాయి. అనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

పన్ను చెల్లింపులో కిరికిరి

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఇదీ టపాసుల విక్రయాల తీరు


హిందూపురంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు

హిందూపురం: టపాసులు కొందరికి కాసులు కురిపిస్తుంటే కొనుగోలుదారుల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. దీపావళి పండుగ సందర్భంగా స్థానిక ఎంజీఎం గ్రౌండ్‌లో 47 షాపులు వెలిశాయి. కాగా క్రాకర్స్ దుకాణాల లైసెన్సుల విషయంలోనూ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పక్కా కమర్షియల్‌గా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు అధిక ధరలతో వ్యాపారులు తమ జేబులకు చిల్లులు పెడుతున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు.

మీకూ లాభం.. మాకూ లాభం ..

పట్టణ పరిధిలో బాణసంచా అమ్మకాల కోసం మున్సిపల్ రెవెన్యూ అగ్నిమాపక విద్యుత్ పోలీస్ శాఖల అధికారులతో కూడిన కమిటీ నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరి. ఇక్కడే వాణిజ్య పన్నుల విభాగం సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి తాత్కాలిక విక్రయదారులకు డీలర్షిప్ ఉండదు. వారికి అడ్వాన్స్‌డ్ లైసెన్స్ జారీ చేస్తారు. దీని ప్రకారం తాము విక్రయించబోయే సరకు విలువపై 18 శాతం జీఎస్టీని ముందుగానే చెల్లించాలి. ఉదాహరణకు రూ.లక్ష విలువైన సరకు అమ్మితే రూ.18 వేలు పన్నుగా చెల్లించాలి. వ్యాపారం ముగిశాక, అమ్మిన సరుకు విలువ అంచనా కన్నా ఎక్కువైతే మిగిలిన పన్ను చెల్లించాలి. లేదా తక్కువైతే అదనంగా కట్టిన డబ్బు అధికారులు వాపసు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇక్కడే కొందరు సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కవుతున్నారు. 'ఎంత సరుకైనా అమ్ముకో ప్రభుత్వానికి కొద్దిగా పన్ను కట్టి, మాకు కొంత మామూలు ఇస్తే చాలు, మీకూ లాభం, మాకూ లాభం' అంటూ లెక్కలతో సహా వివరిస్తున్నట్లు సమాచారం.

మొక్కజొన్న.. కొనేదెవరన్నా?


ఎల్లోటిలో ఓ రైతు ఇంటిలో నిల్వ ఉంచిన మొక్కజొన్న బస్తాలు

మడకశిరరూరల్: అప్పులు చేసి రైతులు మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులకు మద్దతు ధర లేక పంటను ఇంటిలోనే నిల్వ ఉంచుకుంటున్నారు. మడకశిర నియోజవర్గవ్యాప్తంగా సుమారు 1900 హెక్టార్లలో పంట సాగు చేశారు. కూటమి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా నేటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ప్రసుత్తం మార్కెట్‌లో క్వింటాల్ రూ. 2వేల లోపు ధర ఉందని ఈ ధరకు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడి తప్ప లాభం రాదని రైతులు చెబుతున్నారు. ఎల్లోటి గ్రామానికి చెందిన రైతు శ్రీరామరెడ్డి పండించిన మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లేకపోవడంతో దాదాపు 120 క్వింటాళ్లకు పైగా ఇంటిలో నిల్వ ఉంచారు. మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

అగళి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అని శాఖ అధికారులు హాజరుకావాలని కోరారు.

చట్టాలపై అవగాహన

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని నిజాంవలి కాలనీలో ఆదివారం సాయంత్రం డీఎస్పీ వెంకటశివనారాయణస్వామి ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గుడిబండ: అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఎంజేపీ బాలిక కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆదివారం కళాశాలలో ఆయన్ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. వక్తలు ప్రసాద్ సేవలను కొనియాడారు. కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మారెమ్మదేవి జాతర పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

అమరాపురం: వీరాపురం గ్రామంలో మారెమ్మదేవి ఆలయ ప్రవేశం, జాతర పోస్టర్లను ఆ గ్రామ పెద్దలు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ గ్రామంలో ఉన్న మారెమ్మదేవి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు, దాతల సహకారంతో నూతనంగా ఆలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఈ నెల 27 నుంచి ఆలయ ప్రవేశం, నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

శనీశ్వరుడి సన్నిధిలో కేతిరెడ్డి


శీతలాంబదేవికి పూజలు నిర్వహిస్తున్న కేతిరెడ్డి

పావగడ: స్థానిక శనీశ్వర స్వర్ణ దేవాలయంలో వెలసిన శనీశ్వరస్వామిని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆదివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సమితి పదాధికారులు కేతిరెడ్డికి ఘనంగా స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సన్మానించారు. ఆయన తొలుత శనీశ్వరస్వామిని కొలిచి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారు శీతలాంభదేవిని దర్శించుకుని కుంకుమ పూజలు చేపట్టారు. ఆయన వెంట ఎస్ఎస్‌కే సంఘం ఉపాధ్యక్షుడు లాయర్ వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జ్యోతి

అమరాపురం: స్థానిక అమరాపురం ఆరోగ్యమైత్రి కూటమి ఆధ్వర్యంలో ఆదివారం ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కర్ణాటక చిత్రదుర్గం నుంచి వచ్చిన డాక్టర్ జ్యోతి 120 మంది మహిళలను పరీక్షించి ఉచితంగా రూ.20వేలు విలువ చేసే మందులను అందజేశారు. పావగడ నుంచి వచ్చిన డాక్టర్ ఓంకార్ నాయక్ 100 మంది రోగులను పరీక్షించి వారికి తగు సలహాలు సూచనలు అందించారు. స్థానిక డాక్టర్ బసవరాజు 80 మంది రోగులను పరీక్షించారు. కూటమి సభ్యులు శ్రీనివాస్‌మూర్తి, రమేష్‌బాబు, అజయ్‌కుమార్, సిద్దేశ్వర బసవరాజు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు

హిందూపురం: మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ పెనుకొండ ఆర్డీవో కార్యాలయం ముందు ఈనెల 23న తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పీపీపీ విధానాన్ని రద్దు చేసి వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పిల్లల వైద్య విద్యకుఈ విధానం తీవ్ర విఘాతం కలిగిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట నాగరాజు, నియోజకవర్గ అధ్యక్షులు కె రామాంజనప్ప, కొట్నూరు గంగప్ప, గంగాధరప్ప నారాయణస్వామి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే బావిలోకే..


రోడ్డు పక్కనే ఉన్న బావి

మడకశిరరూరల్: పట్టణ పరిధిలోని బేగార్లపల్లికి వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న బావి ప్రమాదకరంగా మారింది. బావి రోడ్డుపక్కనే ఉండటంతో ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రధానంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. గతంలో బావి వద్ద ప్రమాదాలు జరిగాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బావి వద్ద రక్షణ గోడ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ధర్మవరం అర్బన్: టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని డీఎస్పీ హేమంత్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ కేంద్రాలను ఆదివారం డీఎస్పీ పరిశీలించారు. ప్రతి షాపూ లైసెన్స్ కలిగి ఉండాలని, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.